# అందుకో ఈ ప్రేమ లేఖ

కలం మూసి ఒళ్లు విరుచుకున్నాడు భాస్కరం. కాగితాలన్నీ జాగ్రత్తగా దొంతర పెట్టాడు. డ్రాయరు సొరుగు లాగి ఒక గుండుసూది తీసిపెట్టాడు. ఆప్యాయంగా మడిచిపెట్టి కవరులో పెట్టాడు. కొసనాలికతో కవరు అంటించాడు. కవరుమీద "అనురాధ" అని వ్రాశాడు. టేబిలులైట్లు ఆర్పి లేచి నిలబడి ఒళ్లు విరుచుకున్నాడు. వెళ్ళి కిటికీదగ్గిరనిలబడ్డాడు.

రాత్రి కొంచెంగా వర్షం పడింది. పెరట్లో పారిజాతం ఘుమాయిస్తూంది. ఇంటిముందు రాధామనోహారం గుత్తులు గుత్తులుగా పూసి బరువుగా వంగింది. వర్షంలో తడిసి పూవులు ఆకులూ అందంగా ఉన్నాయి. పది గంటలకల్లా ముహూర్తం కావడంవల్ల ఇంట్లో కొంచెం అలికిడి వినిపిస్తూంది అప్పుడే. పూర్తిగా చీకట్లు విడిపోలేదు. "ఇంత మంది చుట్టాలున్న ఈ ఇంట్లో ఎక్కడ ఉందో అనూరాధ" అనుకుంటూ కిటికీలోనించి చూస్తున్నాడు భాస్కరం. చిన్న పావడా జాకెట్టూ వేసుకుని ఓ అమ్మాయి అప్పుడే రాధా మనోహారం గుత్తులు కోయడానికి తావత్రయపడుతుంది. ఆ పిల్ల కనబడ్డం ఎంతో సంతోషం కలిగించింది భాస్కరానికి.

"పాపా!" అని పిలిచాడు. పాప తలఎత్తి చూసింది. "ఇటురా!" అని చేయి ఊపాడు. చిన్నికాళ్లు తడబడేటంత త్వరగా మెట్లపైకి వచ్చింది పాప.

"నీకు పెళ్ళికూతురు తెలుసా!" అడిగాడు.

"ఓ" అని తల ఊపింది అమ్మాయి.

"అయితే ఈ కవరు ఇస్తావా?" గుండె దడదడ మంటూండగానే అడిగాడు.

"ఎందుకు?" అంది అమాయికంగా పాప.

"ఉట్టినేనే!" అన్నాడు ఏం సమాధానం చెప్పాలో తెలియక.

"సరే" అని కవరు అందుకుని పరిగెత్తి వెళ్ళిపోయింది. తేలికగా నిట్టూర్చి మంచంమీద వాలాడు భాస్కరం. "కాటుకకళ్ళు తెరుస్తూ తెరుస్తూ ఉంటుంది రాధ" అనుకున్నాడు.

"ఇంకా నిద్రపూర్తిగా వదలకుండానే ఈ ఉత్తరం చదువుకుంటుంది. ఏం జవాబు ఇస్తుందో!" అనుకుంటూ నిద్ర పోదామని ప్రయత్నించాడు భాస్కరం.

అనూరాధని తట్టి లేపింది పాప. వాడినపువ్వులాగా ఉంది అనూరాధ. కవరు పడవేసి పారిపోయింది పాప. అత్రతతో, వణికే చేతులతో కవరు చించింది రాధ.

"రాధా,

తలగడకి తల ఆన్చి ఈ ఉత్తరం చదువుకుంటావు కదూ! నీ జుట్టు చిందరవందరగా ఉంటుంది. అలవాటుగా మణికట్టుతో కళ్ళమీదపడే ముంగురులను పైకి తోసుకుంటూ

చదువుతావు. చదివి ? నవ్వుకుంటావు కాబోలు! అవునా? నువ్వు సంతోషంగా ఉన్నావు! నిజానికి కన్నీరు విషాదానికే. ఆనందానికి కూడా దగ్గిరే కదూ ?

రాధా, నిన్న రోజంతకీ ఓ అరగంట చూశానేమో! ఏదో హుందా వచ్చింది నీకు! కళ్లు బరువుగా వాలి ఉన్నాయి. పసుపంటి నీ చీర గమ్మత్తుగా ఉంది. అందంగా పెళ్ళిబొట్టు, బుగ్గన చుక్క. "పరుగేగాని నడకరాని పాపాయీనా?" అనిపించింది. నాకేసి చూస్తావేమో అని ఎంతో ఆశపడ్డాను. కాని ఈ దీనుడిపై అనుగ్రహం తప్పింది. రాధా ఒక విధంగా ఈసారి కిది ఆఖరుసారి చూడడం అనిపించింది. ఎందుకో తెలుసా? తెల్లవారి పది గంటలు దాటేసరికి నువ్వు పరాయి దానివి అయిపోతావు! నాకు తెలిసిన రాధని మళ్ళీ కలుసుకుని సెలవు తీసుకునే అవకాశం ఉండకపోవచ్చు నాకు. గత ఇరవై ఏళ్ళుగా ఆరాధించి ప్రేమించిన అమ్మాయివి కదా నువ్వు! నీ దగ్గిర సెలవు తీసుకోకపోతే ఎలాగ? అందరికీ పాదాభివందనం చేశావు ఉదయం. నాకూ చేసివుంటే "ఇలాగే ఎప్పుడూ సంతోషంగా ఉండు!" అని దీవించేవాణ్ణి. కాని నీకు తెలుసు, నేను మాటకారిని కానని. నువ్వు ఎప్పుడూ సంతోషంగా ఉండాలని నా కోరిక రాధా. కాని జీవితం అంతా పూలబాట కాదు...

నా పదో ఏట ఏడుసుకుంటూను మామయ్యా మా ఊరు వచ్చాను. అప్పటికే సర్వం అయిపోయాయి నాకు. పల్లెలో ఆఖరు అనుబంధం కూడా తెగిపోవడంతో మామయ్య చేరదీసి ఆదరించాడు. స్కూల్లో చేర్పించాడు. మామయ్య బాగా

ప్రాక్టీసు ఉన్న డాక్టరు. వచ్చేపోయేవారి రద్దీ ఎక్కువ. అత్తయ్య నన్ను ఎంతో ఆదరించింది. "నీకేం భయం భాస్కరం, నాకేమంత పది మంది ఉన్నారని. నువ్వు నా కొడుకుతో సమానం" అంది నా తల నిమురుతూ. అనాటి నుండీ నాకు అత్తయ్య దగ్గిరే. చనువు, పోనుపోను మారాం అధికం అయ్యాయి. నువ్వూ ఉండేదానివి, బొద్దుగా రబ్బరు బొమ్మలాగా. ప్రతి దానికీ మారాం చేసేదానివి. అత్తయ్య కొట్టపోతే పరిగెత్తి వచ్చి నా వెనకాతల దాక్కునే దానివి. "ఈసారికి ఊరుకో అత్తయ్యా" అని నీ తరఫున ప్రాధేయ పడేవాణ్ణి. కొంచెం కసిరితే చాలు ఊరేగిరిపోయేలా రాగాలు ప్రారంభించేదానివి. ఓ పట్టాన ఊరుకునే దానివి కాదు. నువ్వెందుకైనా ఏడుస్తావంటే నాకు భయం వేసేది నాకు!... కొంచెం తెరిపిగా ఉన్నప్పుడు ఎంతో సరదాగా కబుర్లు చెప్పే వాడు మామయ్య. అత్తయ్య రకరకాలు వంటలు వండిపెట్టి ఆదరంగా తినిపించేది కూర్చోపెట్టి. నాకు అత్తయ్య మమాయ్య ఎంతో నచ్చారు. కాని నువ్వేమాత్రం నచ్చలేదు. నువ్వంటె భయం కూడా వేసింది!

హైస్కూల్లో చదువుతున్నప్పుడు కొంతకాలం నిన్ను పట్టించుకోకుండా తిరిగేవాణ్ణి. కాని ఇదెంతో కష్టం అయ్యేది. ఎందుకో తెలుసా? నన్ను చూస్తేచాలు వదిలేదానివి కాదు. నా వెనకనే తోకలాగా తిరిగేదానివి. పక్కింటి రామంతో నేను ఆడుకుందుకు వెడితే, ముళ్ళతీగెలు మధ్యలో దూరి ఉండిపోయి గోలపెట్టి ఏడ్చేదానివి. వచ్చి నెట్టు వచ్చి ఇవతలికి తీసేవాణ్ని! అలా చేశాక చేటంతముఖం చేసుకుని చూసే దానివి నాకేసి!

అత్తయ్యా ఎప్పుడేనా పక్క ఇంటికి పెత్తనానికి వెడితే నిన్ను చూసుకోమనేది. అలా ఓసారి నేను కాపలా కాస్తూంటే వెనకింటివాళ్ళ పార్వతి చూసింది. నాకు చచ్చేంత సిగ్గు వేసింది. నువ్వు అప్పుడెలాగ ఉన్నావో తెలుసా? చేతుల నిండా, ముఖంనిండా చాక్లెట్టు బంకలాగా పట్టించుకున్నావు. నాతో దెబ్బలాడి ఆ చేతులు నా తలకి పూయాలని చూస్తున్నావు పార్వతి ఫక్కున నవ్వింది. నా పన్నెండేళ్ళ మగతనం దెబ్బతింది. నిన్ను ఒకటి అంటించాను. పాపం నీ కేం తెలుసు? ఆ బంకచేతులతోనే నా మెడ పట్టుకుని ఆవురుమంటూ ఏడ్చావు! నా కింకా కోపం తగ్గలేదు. ఒక్క తోపు తోశాను. దాంతో నువ్వు కిందపడ్డావు. మోకాలు చెక్కుకుపోయింది. పార్వతి మాట్లాడకుండా వెళ్ళిపోయింది. ఓ క్షణం నేను ఆగి చేతులు చాపాను నీకోసం. నీ బుగ్గలాగే నీ అరచేయికూడా బంకగా, వెచ్చగా ఉంది! నీ కళ్ళు నల్లగా విశాలంగా ఉన్నాయి. అప్పుడే తొలిసారిగా నీకళ్ళు చూశాను. ఎంతో అమాయికంగా, ప్రేమతో నమ్మకంతో నిండి ఉన్నాయి. నిన్ను బాధ పెట్టాను. కాని నువ్వేం పట్టించుకోలేదు. పైగా "కోపం పోలేదూ?" అని అడిగావు. నాకు నీ మీద జాలి వేసింది. సిగ్గు వేసింది.

ఇంకో రెండేళ్ళు గడిచేసరికి నీతో కాలక్షేపం చేయడం నిజంగా ఆనందాన్ని ఇచ్చింది. నాతోపాటు ఆడుకోడానికి వచ్చినా ఇబ్బందిగా ఉండేదికాదు. నీ కాలుకి దెబ్బతగిలినా, చెయ్యి కోసుకున్నా మామయ్యకి తెలియకుండా టించరు తెచ్చి వేసేవాణ్ణి. నీకు జ్ఞాపకం ఉందో లేదో నిన్ను భయపెట్టిన బురదపామును తొలిసారిగా నేనే చంపాను! నువ్వే

ప్పుడూ చూడలేదన్న. కాకిగూడు తొలిసారిగా నేనే చూపె ట్టాను. నీకు అందని పూలు నేనే కోసి ఇచ్చాను. నిన్ను వేళా కోళం చేసిన స్కూలుపిల్లల్ని తన్ని తన్నులుకూడా నేనే తిన్నాను !

నీకు ఒంట్లో బాగులేకపోతే మామయ్య ఇచ్చే చేదు మందులు నేనే నీచేత తాగించగలిగేవాణ్ని. అది నాకెంతో గర్వంగా ఉండేది...

కాలం బంగారు రెక్కలు కట్టుకొని పరుగులుపెట్టే రోజు లవి! నేను మామయ్య కోరికపై పట్నంలో మెడిసిన్ చదవ డానికి చేరాను. దానితో అంతామారిపోయింది. సెలవులకి రావడం పోవడం నా పంతు, ఉన్నచోటనే ఉండటం నీవంతు అయింది.

కాలేజీలో చేరాక తలఎత్తి తిరగడం వస్తుంది. నేను మూడో సంవత్సరం చదువుతూండగానే... సెలవుల్లో మామ య్యతో నడిచి వెడుతూఉంటే అంతా "చదువెలా సాగు తుందోయ్?" అంటూ ప్రశ్నలు వేసేవారు. ఇది అదే ఇల్లు కాని ఎంత తేడా. ఎన్నేళ్ళనించో తెలిసిన మనుష్యులు దగ్గిర నుండి దూరంగా అయిపోయినట్టు అనిపిస్తుంది. అయినా నా అసలు జీవితం కాలేజీ కాంపౌండులో, గదులలో, లెక్చరర్ల పాఠాలలో పరీక్షలలో ఉందనిపిస్తుంది. అప్పటికి నువ్వు మారిపోయావు. నీ రూపురేఖలు మారిపోయాయి. చక్కని వాలుజడ వూపుతూ నడిచే దానివి. నీ కళ్ళు నాకు జ్ఞాపకం ఉన్నంటెకంటె పెద్దవిగా అందంగా తయారు అయ్యాయి. నీలో ఏదో గమ్మత్తు మెరుపు వచ్చింది. గంభీరంగానూ, దూరదూరంగానూ ఉండడం ప్రారంభించావు నువ్వు...

...నే నా రోజు తిరిగి వెళ్ళిపోతున్నాను. నీతో ఏకాంతంగా ఓ క్షణం గడపాలని తహతహలాడాను. కాని నువ్వు నన్ను తప్పించుకుని అత్తయ్య చీరచెంగు వదలకుండా తిరిగావు. అత్తయ్య విసుక్కుంది కూడా ... నేను వెళ్ళిపోయాను. కాని తిరిగి అటువంటి పరిస్థితి నన్ను తిరిగి పిలిపిస్తుందని అనుకోలేదు. మామయ్యకి గుండెపోటు వచ్చిందని అత్తయ్య ఇప్పించిన టెలిగ్రాము అందుకుని స్థాణువులాగా ఉండిపోయాను. తక్షణం బయలుదేరి వచ్చాను. డాక్టరు కోర్సుపూర్తి అయి ఆస్పత్రిలో ఒక సంవత్సరం సర్జను గిరి వెలిగిస్తున్న నాకు మామయ్య పోయాడంటే అదెలాగో అనిపించిందేగాని నమ్మబుద్ధి కాలేదు.

అత్తయ్య ముఖం చూడలేకపోయాను. నువ్వు అసలు కనబడనేలేదు. యాంత్రికంగా పెద్దలు చెప్పిన పనులు చేసి మామయ్యకు అంతిమ యాత్ర అవసరాలు తీర్చాను. నా ఋణం అంతటితో తీరేదికాదు. ఎవరూ లేరుకదా అని మామయ్యగదిలో కూర్చుని చేతులు ముఖంమీద కప్పుకుని ఏడ్చాను. ఎక్కడినుంచివచ్చావో నువ్వు. వచ్చి నా భుజం మీద చెయ్యి వేశావు. "ఏడవకు బావా, నిన్నిలా చూస్తే అమ్మ అసలు తేరుకోదు" అన్నావు. "రాధా" అంటూ నీ చేతులతో నా ముఖం కప్పుకుని ఏడ్చాను. నువ్వు అప్రయత్నంగానే నా జుట్టుమీద చేయివేసి నిమురుతూ ఉండిపోయావు. అలాగే ఇద్దరం ఉండిపోయాం. చుట్టూ చీకటి పడిపోయింది. మన మనస్సుల్లో ఏదో ప్రశాంతత ఆవరించుకుంది...

అమ్మకి తోడుగా ఉండడంకోసం నువ్వు చదువు మానేశావు. నాకుకూడా ఇంటిపట్టున ఉండి మామయ్య వదిలిపెట్టి

వెళ్ళిన ప్రాక్టీసు చేపట్టాలనిపించింది. నా మాటకి అత్తయ్య ఎంతో సంతోషపడింది!... నేను తప్పటడుగులు వేశాను... మెప్పులూ పొందాను. నెమ్మదిగా చదువుకున్నది అమలులోకి దింపాను. నీకు జ్ఞాపకం ఉండే ఉంటుంది. ఓ ముసలాయన్ని గదిలోంచి గెంటేశాను! ఒకడికి తప్పుమందు వ్రాసి వాడి ప్రాణంమీాదికి తెచ్చాను.

...ఆరోజు నాకు బాగా జ్ఞాపకం. సాయంత్రం పూట క్లినిక్ లోకి వెళ్ళడానికి ముందు కాఫీకోసం వంటింట్లోకి వెళ్ళాను. అత్తయ్య దిగాలుపడి కూర్చుని ఉంది. పక్కనే పీట వాల్చుకు కూర్చున్నాను. "కాఫీ కావాలి అత్తయ్యా" అన్నాను.

"ఇస్తానుగాని భాస్కరం, నీతో ఓ సంగతి చెప్పాలి" అంది అత్తయ్య.

"చెప్పు" అన్నాను.

"అదే మన రాధ లేదూ" అంది.

"ఎక్కడికెళ్ళిందత్తయ్యా?" అడిగాను.

"పక్కింటివాళ్ళతో కలిసి సినిమాకంటూ వెళ్ళింది భాస్కరం. ఇదీ వారంలో నాలుగోసారి వెళ్ళడం. నాకుదాని ధోరణేం నచ్చడం లేదు. ఆడపిల్లలందరితో పాటూ ఆరామం కూడా పెడుతున్నాడు. ఈడువచ్చిన పిల్ల, ఏం బాగుంటుంది చెప్పు? అదే అంటే మూతి మూారెడు చేసుకుని వెళ్ళింది" అంది అత్తయ్య.

"ఇంజనీరు. బాగా ఉన్నవాడ్లు. మన రాధకి అడిగి చూద్దాం అత్తయ్యా, రాధకి ఇష్టం అయితే మనం ఎందుకు కాదనడం?" అన్నాను.

దానితో అత్తయ్యకి కోపమే వచ్చింది.

"బాగుంది వరస. అది ఆడింది ఆటా పాడింది పాటానా ! మహారాజులంటే మరి రెండు వడ్డించమన్నారట ! అయినా నీ కేం లోటని పరాయి సంబంధాల కోసం పాకులాడడం ?" అంది అత్తయ్య.

ఆ రోజుదాకా నాకు నీ దృష్టిలేదు. నువ్వు పరాయి మగవాడితో స్నేహం చేయటం ఏమిటి ?... నేను మోసిన రాధ, ఏడిపించి ఊరుకోపెట్టిన రాధ. కాలుకి దెబ్బతగిలితే ఎత్తుకుతిరిగిన రాధేనా ఈ రాధ అనిపించింది. అయినా నేను నీ దారికి అడ్డు నిలవదలుచుకోలేదు. కాని ఏ మగవాడూ తన కుడిచేతిని గురించీ, పీల్చేగాలిని గురించీ ఆలోచిస్తాడు ? నువ్వు నా కంతకంటే సన్నిహితం అని తెలుసుకున్నా ఏం చెయ్యగలను ? అనుకున్నాను ... మరునాడంతా నిన్ను కనిపెట్టి చూశాను. మీరంతా నవ్వుతూ రామంకారులోకి ఎక్కుతున్నారు. అప్పుడే నా కుడిచేతిలో నెప్పి పుట్టింది రాధా, నా గుండెల్లో మంట రేగిందికూడా. కాని నీ కెలాగ చెప్పను?

నీకు జ్ఞాపకం ఉందా? ఆ రోజు రాత్రి నువ్వు నా బల్ల తుడుస్తున్నావు. "నువ్వు రామాన్ని పెళ్ళి చేసుకుంటావా?" అని అడిగాను. "చేసుకుంటే నువ్వేం అనుకుంటావు బావా?" అనిఎదురు ప్రశ్న వేశావు. "ఏం బాగానే వుంటుంది అనుకుంటాను. మీ ఇద్దరికీ సరిపోతుంది రాధా!" అన్నాను. ఎందుకో తెలియదు. నా గుండెలమీద తల పెట్టుకుని భోరున ఏడ్చావు. నాన్నగారుపోయిన బెంగా, రామంతో నీకు పెళ్ళి అవదేమో అన్న భయంచేత ఏడ్చావని ఓదార్చాను. నా రెండు చేతులూ నిన్ను పొదువుకొని ఓదార్చాను.

ఆక్షణంలోనే ఇంకోసంగతికూడా నాకు తెలిసింది. నిన్ను ఎన్నే ళ్లగా ప్రేమిస్తున్నానో కూడా తెలియనంతగా నన్ను ప్రేమిస్తున్నావని తెలుసుకున్నాను. కాని నువ్వు డాక్టరుని పెళ్ళి చేసుకోనన్నావు ఓసారి. ఆ సంగతి ఎలా మరిచిపోను? నీకు జ్ఞాపకం ఉందా? "అమ్మలాగా నేను బాధ పడలేను. సమయానికి భోజనం లేదు, నిద్ర లేదు సరికదా ఏ సరదా లేదు. ఏం బ్రతుకది? నేను ఛస్తే డాక్టరుని పెళ్ళి చేసుకోను" అన్నావు. జ్ఞాపకం ఉందా?

...కాని ఏం చేస్తాను? ఓ రోజు నువ్వూ రామం అతని చెల్లెళ్ళు కారమ్సు ఆడుతున్నారు. కేరింతలు కొడుతున్నారు. అప్పుడే బాగా చీకటి పడిపోయింది. నేనూ ఆస్పత్రిగది తలుపులు మూసి చేతులు కడుక్కుంటున్నాను. ఇంతట్లో ఎవరో దబదబ తలుపు బాదారు. తలుపు తెరిచాను. కళ్ళలో ప్రాణాలు పెట్టుకుని నిలబడిందా అమ్మాయి. ప్రాణాలు తీసు కుందామని మందు తింది. తీరా తిన్నాక భయంవేసి పరి గెత్తుకు వచ్చింది. నేను నర్సుని కాంపౌండర్‌నికూడా పంపిం చేశాను. ఆ అమ్మాయిని ఓ క్షణంకూడా వదలడానికి లేక పోయింది. నిన్ను, రామాన్ని కేకవేశాను. వచ్చావు. రావ డమే కాదు రాధా, ఏ కష్టమైన పనులైతే చేయనుకాక చేయనని వాదించేదానివో అవన్నీ అనుకోకుండా చేశావు. నీ శాయశక్తులా నాకు తోడుగా నిలబడ్డావు. రామం ఫోను దగ్గరే ఉండి అంబులెన్సుకోసం తాపత్రయ పడ్డాడు. అదీ వచ్చింది. మనమూ గెలిచాం. ఆ అమ్మాయి చచ్చిపోలేదు, బ్రతికింది రాధా! మనిద్దరం కలిసి ఓ ప్రాణం పోకుండా కాపాడ గలిగాం. ఆరోజు నువ్వెంతో తృప్తిగా సంతోషంగా కని

వి.పి. జ్ఞాన గ్రంథాలయము, ...
ప్రవేశ సంఖ్య 27795


పించావు రాధా. అది నిజమో... నా భ్రమో!

రేపు నీకు పెళ్ళి అయిపోతుంది. ఈ ఉత్తరం నాకు తెలిసిన రాధకి గుడ్ బై చెప్పడానికే. నాలో నిలిచి నా జీవితం వెల్గుతోనింపిన ఆ అమ్మాయికి వీడ్కోలు చెప్పకుండా ఎలాగ ఉండగలదు? ఎందుకంటావా? రేపటి తరవాత నువ్వా పిల్లవి కాలేవు కదా? నువ్వు హఠాత్తుగా మారిపోకపోవచ్చు. కాని మారకతప్పదు రాధా, జీవితం నిన్ను మార్చేస్తుంది. ప్రేమ, సంతోషాలు నిన్ను మార్చేస్తాయి. సుఖదుఃఖాలు నిన్ను మార్చేస్తాయి. చిన్నవీ, చితకవీ సమస్యలు అలనటలు అన్నీ నిన్ను మారుస్తాయి. పసివాళ్ళ పుట్టుకలు అందోళనలు. అందుకోవాలనుకున్న ఆదర్శాలు అన్నీ నిన్ను మారుస్తాయి రాధా... తప్పక మారుస్తాయి ... అన్నీ నిన్ను అమ్మాయి గారినుంచి అమ్మయిగారుగా మర్చేస్తాయి, కన్నె పిల్లని నవవధువుగా జాణగా మార్చివేస్తాయి. ఇన్నాళ్ల ప్రేయసివి జీవిత భాగస్వామిగా మారిపోతావు... గుడ్ బై. ఇదో ప్రేమకథ. దీనికి ప్రారంభం ఎప్పుడో తెలియనట్టే ముగింపుకూడా తెలియదు రాధా. ఇదివరలో దెబ్బలాడు కున్నాం. ఇకపైనా దెబ్బలాడుకోవచ్చు. కాని జీవితంలో నీకు తొలినుండీ నేను స్నేహితుణ్ణి. జీవితాంతం అలాగే ఉంటాను. జీవితంలో ఇప్పటిదాకా నీ ఆరాధకుణ్ణి. ఎప్పటికీ అలాగే ఉంటాను. రేపు నీభర్త వేరొకరు కాబోతున్నారు కదామరి! నీకు భయంగా లేదుకదూ? డాక్టరుని పెళ్ళి చేసుకుంటున్నందుకు భయపడడం లేదుకదూ?... రాధా, నిజంగా నాకే కొంచెం భయంగా ఉంది. గుడ్ నైట్ రాధా. తీయని కలలో తేలుతూ నిద్రపో. కాని ఇది నువ్వు చదవడం పూర్తి చేసేసరికి గుడ్

మార్నింగ్ అవుతుందిలే. నా రాధా. నిన్ను మనసారా ప్రేమిస్తున్నాను. కాంక్షిస్తున్నాను... నీ భాస్కరం."

ఉత్తరం చదవడం ముగించిన అనూరాధ కళ్ళవెంట అశ్రువులు జలజలా రాలుతూంటే తడబడే కళ్ళతో భాస్కరం గదిలోకి పరిగెత్తింది... నిద్రరాక ఇంటికప్పు కేసి చూస్తూ పడుకున్న భాస్కరం గుండెలపై తల ఆన్చి నిట్టూర్చింది. గుండెల కంటుకుపోయిన రాధని ఆప్యాయంగా కౌగలించుకున్నాడు భాస్కరం.

"బావా, నాకీ లేఖ ముందే ఎందుకు రాయలేదు?" అడిగింది అనూరాధ.

"ఏ లేఖ రాధా?" చిలిపిగా అడిగాడు భాస్కరం.

సిగ్గుతో ఎర్రనైన ముఖం అతని గుండెల్లో దాచుకుంది అనూరాధ.

బాగా తెల్లవారిపోయింది.

అల్లుడికి కాఫీ పట్టుకు వచ్చిన అత్తయ్య కళ్ళపడ్డ దృశ్యం చూసి అలాగే నిలబడిపోయింది గుమ్మంలో ఆనందంతో ఆమె కళ్ళుకూడా చమర్చాయి. లేనికోపం తెచ్చుకుంటూ "చాలుచాలు, ఎవరైనా చూస్తే నవ్విపోతారు, ఇంటినిండా చుట్టాలు. లోపలికి వెళ్ళు... రాధా" అంటూ కూతురిని కసిరిందా ఇల్లాలు.

ఉలిక్కిపడి లేచిన అనూరాధ తల్లికి ముఖం చూపెట్టకుండా గది బయటికి జారుకుంది.

ఏమీ తెలియని ముఖంపెట్టి కాఫీగ్లాసు అందుకున్నాడు భాస్కరం.

(-0-)